క్లుప్తంగా

రైతుల సంక్షేమమే ధ్యేయం



పెర్కిట్(ఆర్మూర్): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ.. రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 100 రోజుల్లో హామీ ఇచ్చిన గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోందని వెల్లడించారు. సమావేశంలో నాయకులు గోర్త దేవేందర్, పండిత్ పవన్, కొంతం మురళి, బాల్ రెడ్డి, కొక్కెర భూమన్న, హరీష్, అజ్జు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): అంకాపూర్ లాలన వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పట్వారి గోపికృష్ణ, పట్వారి తులసి కుమార్, ప్రవీణ్ పవార్, పుష్పాకర్ రావు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి లక్ష్యాలను చేరుకోవాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆర్మూర్ ఏసీపీ బస్వా రెడ్డి సూచించారు. ఆర్మూర్ పట్టణంలో క్షత్రియ యువజన సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం 600 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. క్షత్రియ సమాజ్ విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులతో పాటు సమాజానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్షత్రియ యువజన సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సాత్‌పుతే సంతోష్, దుమాని నీరజ్, క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పండిత్ ప్రేమ్, రెడ్డి ప్రకాష్, బారడ్ గంగా మోహన్ పాల్గొన్నారు.

వర్ధంతి సభను విజయవంతం చేయండి



వేల్పూర్: ప్రజాపంథా పార్టీ నిర్మాణానికి మొదట అడుగులు వేసిన కామ్రేడ్ డీవీ కృష్ణ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ నాయకులు రమేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం అమీనాపూర్‌లో ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాల పాటు విప్లవోద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన కామ్రేడ్ డీవీ కృష్ణ తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి నిజామాబాద్ జిల్లాలో విప్లవోద్యమానికి అడుగులు వేశారని పేర్కొన్నారు. నాయకులు కలిగోట రాజు గౌడ్, తలారి మల్లన్న, అముస్, సృజన్, జ్యోతి, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ బస్టాండ్



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. సుమారు నాలుగు దశాబ్దాల కింద నిర్మించిన ఈ బస్టాండు వాడుకలో లేకపోవడం వల్ల కూలిపోయే దశకు వచ్చింది. అంబేడ్కర్ చౌరస్తాకు సుమారు 200 మీటర్ల దూరంలో జనావాసాలకు దూరంగా ఉండేది. కాలక్రమేణా జనాభా పెరగడం వల్ల ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. బస్టాండు వరకు కొత్తగా గృహాలు నిర్మించారు. గ్రామానికి దూరంగా ఉండడం వల్ల ప్రయాణికులు చాలా తక్కువగా బస్టాండుకు వచ్చేవారు. గ్రామంలో అంబేడ్కర్ చౌరస్తా, గాంధీ విగ్రహం, రామమందిరం, మజీదు వద్ద బస్సు స్టాపులు ఉన్నాయి. గ్రామస్తులంతా వారికి దగ్గరలో ఉన్న బస్సు స్టాపుల వద్ద వేచి ఉండడంతో బస్టాండులోకి బస్సులు వెళ్లడం లేదు. దాంతో బస్టాండు వాడుకలో లేకుండా పోయింది. దీంతో యాచకులు బస్టాండును తమ నివాసంగా మార్చుకున్నారు. కొన్నేళ్లపాటు వేసవిలో ఐకేపీ వారు ధాన్యం కొనుగోలు కేంద్రంగా ఉపయోగించుకున్నారు. గ్రామానికి చేరువలో ఉన్నందున బస్టాండును వాడుకలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆగని రేషన్ దందా!

- విచ్చల విడిగా రేషన్ బియ్యం కొనుగోలు
- అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలింపు

బాల్కొండ: జిల్లాలో రేషన్ దందా ఆగడం లేదు. ఇది వరకే సరిహద్దు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని రేషన్ దందాను కొనసాగించారు. మెండోరా మండల కోడిచర్ల గ్రామంలోని రైస్ మిల్లులోనే 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉంచి పట్టుబడ్డారు. ఆ ఘటన మరువక ముందే బాల్కొండ మండల కేంద్రంలో 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. కానీ అధికారులు మామూళ్ల మత్తులో ఉండటంతో రేషన్ దందా మూడు కిలోలు.. ఆరు క్వింటాళ్లుగా సాగుతోంది. పల్లెల్లోకి మోపెడ్ వాహనాలపై వచ్చి కిలోకు 18 రూపాయాల చొప్పున కొనుగోలు చేసుకుని, బియ్యం అక్రమ వ్యాపారుల వద్ద 20 రూపాయాలకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. బాల్కొండ మండల కేంద్రం అడ్డాగా రేషన్ బియ్యం దందా సాగుతోంది. మన రాష్ట్రంలో కొనుగోలు చేసి పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలో విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. భారీ వాహనాలలో రేషన్ బియ్యంను తరలిస్తున్నారంటే దందా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.



అసలెందుకు పంపిణీ..

గ్రామాల్లో పేదవారికి కాకుండా పెద్దవారికి కూడా రేషన్ కార్డులు అందించడం వల్లే సమస్య ఉత్పన్నమవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఐదెకరాలు పైగా భూములు ఉన్న వారికి కూడా రేషన్ కార్డులు ఇచ్చి బియ్యం ఉచితంగా అందిస్తే తినడానికి ఎలా ఉపయోగిస్తారని అంటున్నారు. అలాంటి వారు బియ్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. రేషన్ కార్డుతో పలు ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించవచ్చనే ఆలోచనతో అనేక మంది గ్రామాల్లో అర్హత లేకున్నా రేషన్ కార్డులు పొందినట్లు తెలుస్తుంది. దీంతో రేషన్ దందాకు చెక్ పడకుండా పోతుందని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం, ఉన్నత అధికారులు స్పందించి అనర్హులైన వారి రేషన్ కార్డులను ఏరి వేయాలని పలువురు కోరుతున్నారు. కనీసం పేదవారికైనా మరిన్ని బియ్యం ఉచితంగా అందే అవకాశం ఏర్పడుతుంది.

తూతూ మంత్రంగా దాడులు

సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడపాదడపా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. పీడీ యాక్ట్ పెడుతామంటూ ప్రకటనలు మాత్రమే చేస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో అలాంటివి జరగడం లేదు. రేషన్ షాపుల నుంచే నేరుగా వ్యాపారుల వద్దకు బియ్యం సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అంటే ఏ స్థాయిలో అధికారుల కనుసన్నుల్లో దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి రేషన్ దందాకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



ఆర్మూర్ పట్టణంలో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని జిల్లాలో పలుచోట్ల బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా రాజీనామా చేసి కశ్మీర్ విముక్తి కోసం పోరాడిన గొప్ప జాతీయవాది శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకులు గుర్తు చేశారు. జీవించి ఉన్నన్ని రోజులు దేశం కోసం పరితపించారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



రుద్రూర్‌లో ..



డొంకేశ్వర్‌లో..

కాంగ్రెస్ కార్యకర్తలు సంయమనం పాటించాలి

- పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డి

వర్ని (రుద్రూర్): సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం వెనుక పార్టీకి ఎంతో ప్రయోజనం ఉంటుందని, పోచారం పార్టీలో చేరడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలతో కలిసి ఆదివారం మాట్లాడారు. ఎమ్మెల్యే పోచారం చేరిక విషయమై గత మూడు రోజులుగా సోషల్ మీడియాలో సీనియర్ కార్యకర్తలు కొత్తగా చేరే కార్యకర్తలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తున్నారని అందరూ సంయమనం పాటించాలని సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ బాబా, వర్ని విండో మాజీ చైర్మన్ నేమాని వీర్రాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు అబ్దుల్ బారి, తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి

నవీపేటలో ఆర్‌వోబీని నిర్మించాలి

నవీపేట: మండల కేంద్రంలో ఆర్‌వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి)ని నిర్మించాలని జన వికాస్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. బాసర రహదారిపై ఉన్న రైల్వే గేటుతో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రతి శుక్ర, శని వారాలలో జరిగే వారాంతపు సంతల వల్ల వాహనాలు, వినియోగదారుల రద్దీ పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు 50 నుంచి 60 సార్లు గేటు పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎంపీ ధర్మపురి అరవింద్ చొరవ తీసుకుని నిజామాబాద్‌లోని మాధవనగర్, అర్సపల్లిల మాదిరిగా నవీపేటకు ఆర్‌వోబీని మంజూరు చేయాలని కోరారు. జనవికాస్ సేవా సమితి నాయకులు సూరిబాబు, జావిద్, జనార్దన్, సాయి, సాయితేజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెడ్డు పోశెట్టి

ముగిసిన చార్‌ధామ్ విజయసంకల్ప పాదయాత్ర

- ఆశ్రమానికి చేరుకున్న పాదచారులు
- ఘనంగా స్వాగతం పలికిన భక్తులు, మహిళలు



ఆశ్రమానికి చేరుకుంటున్న పాదయాత్రికులు

నందిపేట్(ఆర్మూర్): కొల్‌పూర్ గ్రామంలో గల భూమయోగేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు చింత రమేష్ స్వామి, రూప దేవి దంపతుల ఆధ్వర్యంలో శిష్య బృందమైన సత్యం, వాల్మీకి, నర్సయ్య, రాజేశ్వర్, పార్థసారథి, లక్ష్మీనారాయణ, సుధాకర్‌లు మార్చి 24న లోక కల్యాణార్థం కొల్‌పూర్ నుంచి చార్‌ధామ్ విజయసంకల్ప యాత్రను చేపట్టారు. 90 రోజులు సుదీర్ఘ ప్రయాణం చేసిన వారు 2 వేల కిలో మీటర్లు నడిచి హిమాలయ పర్వతాలలోని బద్రీనాథ్ క్షేత్రానికి చేరుకున్నారు. ఇందులో భాగంగా కేదారీనాథ్, గంగోత్రి, యమునోత్రి ఆలయాలను దర్శనాలు చేసుకున్నారు. తిరిగి అక్కడి నుంచి బయలుదేరి ఆదివారం ఆశ్రమానికి చేరుకున్నారు. మహాపాదయాత్ర పూర్తి చేసుకుని వచ్చిన చింత రమేష్ స్వామి భక్తబృందానికి భూమయోగేశ్వర ఆశ్రమ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వెల్మల్ గ్రామం నుంచి డప్పు వాయిద్యాలతో, మహిళలు మంగళహారతులతో, భక్తులు పూలు చల్లుతూ పెద్ద ఎత్తున ఆశ్రమం వరకు స్వాగతం పలికారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



స్వాగతం పలుకుతున్న మహిళలు

ముగిసిన మున్సిపల్ కాంప్లెక్సుల లీజు గడువు

- మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో ఆలస్యం
- వేలం ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గల మున్సిపల్ కాంప్లెక్స్ సముదాయాల 25 ఏళ్ల లీజు గడువు మార్చి 31కి ముగిసిపోయింది. తిరిగి ఈ మున్సిపల్ సముదాయాలకు వేలం ఎప్పుడు వేస్తారని ప్రజలు, నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. బల్దియా ఆర్థికంగా పరిపుష్టి సాధించడంతో పాటు ఆదాయం సమకూర్చేందుకు, బల్దియాకు కావాల్సిన ఆదాయ వనరులను అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 1998లో ఐడీఎస్ఎమ్‌టీ స్కీం నిధులతో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాతో పాటు, పాత బస్టాండ్‌లోని వీక్లీ మార్కెట్‌లో 72 దుకాణ సముదాయాలను రూ.కోట్లు వెచ్చించి నిర్మించింది. అంబేడ్కర్ చౌరస్తాలో నిర్మించిన దుకాణ సముదాయాలతో పాటు వీక్లీ మార్కెట్‌లో ఉన్న దుకాణ సముదాయాలను టెండర్ ప్రాతిపాదికన, కాల పరిమితిని 25 ఏళ్ల లీజ్‌కు టెండర్ ప్రక్రియ నిర్వహించారు. టెండర్ ప్రక్రియలో పాల్గొని దుకాణాలు దక్కించుకున్నవారికి సముదాయాలను అప్పగించారు. ఒక్కో దుకాణం అద్దె రూ. 2 వేల నుంచి ప్రారంభమై ప్రస్తుతం రూ.7,529 వసూలు చేస్తున్నారు. లీజు గడువు ముగిసిన దుకాణాలను బల్దియా అధికారులు సొంతం చేసుకొని కొత్తగా టెండర్ ప్రక్రియను నిర్వహిస్తారు అనే క్రమంలో ఎన్నికల కోడ్ అడ్డుగా నిలవడంతో లీజు ముగిసిన విషయం తెరపైకి రాకుండా పోయింది.



అద్దె బకాయిలు అడ్డుగా నిలుస్తాయా…?

అంబేడ్కర్ చౌరస్తాలో గల దుకాణ సముదాయాల అద్దె బకాయిలు, లీజు గడువుకు అడ్డుగా నిలుస్తుందా అనే అంశం అనుమానాలకు తావిస్తుంది. గడిచిన 6 నెలల నుంచి బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అద్దె బకాయి వసూళ్లను వేగవంతం చేశారు. అద్దె బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు కాకపోతే నూతన టెండర్ ప్రక్రియకు అడ్డుగా నిలువనున్నాయని అనుమానాలు రేకెత్తుతున్నాయి. కొత్తగా వేలం ఎప్పుడు వేస్తారా అని నిరుద్యోగులు, వ్యాపారులు, యువకులు ఎదురు చూస్తున్నారు.

నోటీసులు అందించాం



లీజు గడువు ముగిసిన దుకాణాలకు నోటీసులు అందజేశాము. గడువు ముగిసిన దుకాణాలను ఖాళీ చేయించే దిశగా ప్రక్రియ కొనసాగుతుంది. త్వరలోనే టెండర్ ప్రక్రియ ఏర్పాటు చేస్తాము.

– వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్

సమాచారం..

నేడు మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

రెంజల్(బోధన్): రెంజల్‌లోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో మిగులు సీట్లకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. 6వ తరగతిలో 10 వరకు, 10వ తరగతిలో 10 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు వివరించారు. అర్హులైన విద్యార్థులకు సోమవారం పాఠశాలలో పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా జాయిన్ చేసుకుంటామన్నారు

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవా చేపట్టనున్నట్లు తెలిపారు.

సంఘం శరణం గచ్ఛామి

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ ఎంఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం 6 గంటలకు సంఘం శరణం గచ్ఛామి కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు అంగరి ప్రదీప్ తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాలు, భావజాలంపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీతో దృశ్య రూప నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

నృత్య పోటీల్లో ప్రతిభ



నంది అవార్డులు అందజేస్తున్న నిర్వాహకులు

కమ్మర్‌పల్లి: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నృత్య పోటీల్లో కమ్మర్‌పల్లికి చెందిన పరమేశ్వర నృత్య కళానిలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను కైవసం చేసుకున్నారు. వి. శాలిని, వి.శివాణి, బి.శ్రీలాస్య, ఎస్.హాసిని, ఎస్.అభిజ్ఞ, ఏ.పూర్విత, ఎస్.వన్షిక, కె.రిషితలు నృత్య పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. నాట్య గురువు గంట శిరీషతో పాటు విద్యార్థులను నంది అవార్డులతో సత్కరించారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆర్గనైజర్ బిందు లీల, డాక్టర్ వేణుగోపాలచారీ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



గంగాజలాలను తీసుకెళ్తున్న బస్సాపూర్‌వాసులు

బాల్కొండ: బాల్కొండ మండలంలో బస్సాపూర్, బాల్కొండ, ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ముందుగా పవిత్ర గోదావరికి కాలి నడకన వెళ్లి గంగా జలాలను తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో డప్పు వాయిద్యాలతో గంగా జలాలను వల గొడుగుతో ఊరేగించి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ వివాహ పరిచయ వేదిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 100 మంది అబ్బాయిలు, అమ్మాయిలు పాల్గొని తమ వివరాలను నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్రచారి, ఆర్మూర్ ఇన్‌చార్జి మట్టెల ప్రవీణ్‌చారి, నిజామాబాద్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తంబళ్లపల్లి శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం ఆర్మూర్ అధ్యక్షుడు పడకంటి భాను ప్రకాష్, వేవా ఆర్మూర్ అధ్యక్షుడు గద్దె గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హరోంహర (తెలుగు) – 12.00, 6.30 మనమే (తెలుగు)–3.15, 9.45 ఓ మైగాడ్ (తెలుగు) – 9.45
స్క్రీన్-2 –	మహారాజ (తెలుగు) – 12.45, 3.50, 6.55, 10.00
స్క్రీన్-3 –	ఓమైగాడ్ (తెలుగు) – 1.20, 6.45 నింద(తెలుగు)– 4.05, 9.30
స్క్రీన్-4 –	ఓ మైగాడ్ (తెలుగు) – 11.55, 3.10 ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు) – 6.25, మరణం(తెలుగు)– 9.15

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



జాన్కంపేట్‌లో..

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ. 2 లక్షల వరకు ఏకకాలంలో పంట రుణమాఫీ చేస్తామని మంత్రి వర్గంతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ జిల్లాలో పలు చోట్ల ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పార్టీ నిలబెట్టుకుందని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కమ్మర్‌పల్లిలో పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



రెంజల్ మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో..

రామాలయానికి పాతికేళ్లు

- డొంకేశ్వర్‌లో ప్రసిద్ధి చెందిన ఆలయం
- గర్భగుడిలో విశిష్టంగా సున్నపురాయి విగ్రహాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన రామాలయానికి పాతికేళ్లు పూర్తయ్యాయి. డొంకేశ్వర్ నూతన మండలంగా ఏర్పడక ముందే ఉమ్మడి నందిపేట్ మండలంలో నిర్మించిన తొలి రామాలయం కాగా, దీనికి కొంత విశేషమైన చరిత్ర ఉంది. ఇటీవల అయోధ్య రామాలయంలో బాలరాముడిని ప్రతిష్ఠించిన 'మృగశిర నక్షత్రం' లోనే డొంకేశ్వర్ రామాలయంలో కూడా సీతా, రామ, లక్ష్మణుడి విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగింది. అందుకే కోరుకున్న భక్తులకు కొంగు బంగారమై ఆలయం విరాజిల్లుతోంది. 1998లో గుడి నిర్మాణం పూర్తయి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఐతే, గుడిని నిర్మించకముందు ఈ ప్రాంతంలో భారీగా వడగళ్లు పడి పంటలకు నష్టం జరిగేదని, ఆలయం కట్టిన తర్వాత వడగళ్లు పడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గర్భగుడిలో ప్రతిష్ఠించిన సున్నపురాయి విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. ఇటీవల 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే ప్రతి ఏడాది శ్రీరామనవమికి ఉత్సవాలను గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఆలయం డొంకేశ్వర్ నడిబొడ్డున 2 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎత్తయిన ధ్వజ స్తంభం ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కాగా ప్రాంగణంలో చెట్లతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. అయితే, గుళ్లోని రాముడిని భక్తి,శ్రద్ధలతో కొలిస్తే కష్టాలన్నీ తొలగిపోతాయని స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు కూడా విశ్వసిస్తున్నారు.





విశిష్టమైన ఆలయం



డొంకేశ్వర్ నడిబొడ్డున నిర్మించిన విశిష్టమైన తొలి ఆలయమిది. ఇక్కడికి వచ్చిన భక్తులకు రాముడి ఆశీస్సులతో పాటు కోరికలు తీరుతున్నాయని నమ్మకం ఏర్పడింది. పంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం సీత, రామ, లక్ష్మణులకు పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నా. దాతలు ముందుకొస్తే ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించవచ్చు.

– తిరునగరి పాండురంగాచారి, ఆలయ అర్చకులు